# బొమ్మలో చైతన్యం

చిన్నప్పట్నుంచి వరలక్ష్మికి అలంకారాలు బట్టలు ఆభరణాలకు కొదువేం లేదు. వరలక్ష్మికి పేరు పెట్టిననాడే వాళ్ళ అమ్మమ్మతాతలు ఆమె చేతులకు బంగారు మురుగులు, మెడలో జెర్రిపోతు లాంటిబంగారు గొలుసు, కాళ్ళక్కూడా బంగారు పట్టా గొలుసులూ అలంకరించారు. ఇరవై ఒక్కరోజుల వరలక్ష్మి వాటి బరువేమిటో వాటి విలువేమిటో తెలియకుండా ఉయ్యాలలో మత్తుగా పడుకుంది.

వరలక్ష్మి పెద్దదైన రోజు పెద్ద పండుగగా జరిగింది. ఏం తక్కువ పెళ్ళంత సంబరం!- వరలక్ష్మికి పెద్ద జరీ అంచున్న పట్టుచీరను కట్టించారు. నడుంకు బంగారు ఒడ్డాణం చకచక మెరిసింది. మెడలో జగజగమనే రాళ్ళ నక్లెసు, కాసులపేరు, చేతులకు కొత్త గాజులు కడియాలు అలంకరించారు. ఫొటోలు, వీడియోల హడావిడి. వరలక్ష్మి పట్టుచీర - మోయలేనన్ని నగలు- బరువైన పూలజడలో ఎన్నోరకాల ఫోజులు పెట్టించి ఫొటోలు దింపారు. ఆమె స్కూలు స్నేహితులు వచ్చారు. వాళ్ళతో కలిసి బోలెడు ఫొటోలు దిగింది వరలక్ష్మి.

ఆ తర్వాత స్కూలుకు పోవాలని వరలక్ష్మి కనిపించలేదు. ఇంట్లో వాళ్ళు బలవంతం చేయలేదు. వరలక్ష్మి ఇంట్లోనే వుండి ఖరీదైన పత్రికలు తిరగేసి ఏది లేటెస్టు ఫ్యాషనో ఏది లేటెస్టు అలంకరణలో - మేకప్పులో - చదివి తెలుసుకునేది. రిలీజు అయిన ప్రతి సినిమా చూడడం ఏ సినిమాలో ఏ హీరోయిన్ ఏమేమి బట్టలేసుకుంది నగలేసుకుంది గమనించేది. ఏ పాటలో ఏ హీరోయిన్ ఎన్ని డ్రెస్సులు మార్చిందో గుర్తు పెట్టుకోవడం ఆమెకు పెద్ద విద్య కాలేదు. హీరోయిన్లు వేసుకునే లేటెస్టు డ్రెస్సులు కొనుక్కోవడం ఆమె దినచర్య. అవే ఆమె మెదడుకు పదునుపెట్టే అంశాలయ్యాయి. ప్రతి సినిమా పాటల క్యాసెట్టు కొనుక్కొని ఇంట్లోనే ఆ పాటలు వింటూ డ్యాన్సు చేయడం ఆమెకు హాబీ అయింది.

ఇట్లా ఇంట్లో వరలక్ష్మి ఎన్నాళ్ళు కూర్చుంటుందని తల్లిదండ్రులు ఆమెను ఓ మంచి డబ్బున్న సత్యప్రసాద్‌కిచ్చి పెళ్ళిచేసారు. ఇప్పుడు ప్రసాద్ వరలక్ష్మికి కావల్సిన నగలు బట్టలు కొనడం మొదలు పెట్టాడు. వరలక్ష్మి కోరిన బట్టలను నగలను కొనుక్కోవడానికి డబ్బు ఇయ్యడానికి ప్రసాద్ ఎప్పుడూ వెనుక ముందాడలేదు. దాంతో వరలక్ష్మికి ఎన్నడూ ఏ కష్టమూ అనిపించలేదు. ఆమెకు ఇద్దరు పిల్లలు పుట్టారు. స్కూలుకెళ్ళే వాళ్ళయ్యారు. బాగా చదువుతున్నారు. బుద్ధిగా వుంటారు. వాళ్ళతో ఆమెకే సమస్యలూ లేవు.

ప్రసాదే ! ప్రసాద్‌కే రోజు రోజుకు వ్యాపారంలో ఢిల్లీ బెంగుళూరు కలకత్తా ఇంకా పోతే విదేశాలకు పోవడంతో మునుపటికన్నా తీరిక లేకుండా అయిపోయాడు. వాటితోపాటు భర్త మునుపటిలా తనంటే ప్రేమగా ఇష్టంగా లేడని గ్రహించింది వరలక్ష్మి. మొక్కుబడిగా డబ్బయితే వెదజల్లుతున్నాడు. తను అడిగినంత ఇస్తున్నాడు కాని షాపింగుకు కాని, షికార్లకు కాని తనతో రావడానికి అతనికి టైం లేదిప్పుడు. మొక్కుబడిగా పిల్లలతో మాట్లాడ్తాడు. అంతే మాయమైపోతాడు. వ్యాపారమంటూ ఇంట్లో వుండడమే తక్కువయిపోయింది.

క్రమంగా వరలక్ష్మిలో ఏదో అసంతృప్తి శూన్యం ప్రవేశించాయి.

"ఇదంతా ఏందబ్బ!" అనుకుంది వరలక్ష్మి బాధగా.

"ముసలిదాన్నయ్యానా? నేను!" అనుకుంది.

"అదేం లేదు! తన అందంలో లోటు లేదు. తన అలంకరణలో లోటు లేదు. తన కోరికలో లోపం లేదు. మరి! - ప్రసాద్‌లో ఈ మార్పేమిటి?" అని ఆలోచించింది వరలక్ష్మి.

ఒక్కతె వరలక్ష్మి యీ బాధను భరించలేకపోయింది. టెన్షన్‌తో ఆమెకు శాంతి లేకుండా పోయింది. తన బాధనంతా తల్లితో చెప్పుకుంది. తల్లి కూతురిని సానుభూతితో చూసింది.

"వరం! మగాళ్ళంతా అంతే! - వ్యాపారం డబ్బు సంపాదనలో పడి మగాళ్లంతా అట్లానే చేస్తారు. అదంతా పట్టించుకోకు! నీక్కావల్సిన నగలు బట్టలు కొనుక్కోడానికి ప్రసాద్ డబ్బు మాత్రం ఇస్తున్నాడు కదా!" అడిగింది తల్లి.

"నగలు! బట్టలు! అవి కొనిపెడ్తే చాలా!" అంది వరలక్ష్మి స్వగతంగా.

"మరి మగాళ్ళ పరపతి డాబు దర్పం సంపాదన అంతా భార్య వల్లనే గదా బయట పడేది. అందుకే ప్రసాద్ నువ్వడిగిందల్లా కొనిపెట్టాలి. నువ్వు ఆ నగలూ బట్టలు అందంగా వేసుకొని నలుగురి ముందు తిరగాలి! అప్పుడే గదా అందరికీ తెలుస్తుంది ప్రసాద్ అంటే ఏమిటో!" అని నవ్వింది తల్లి.

"ఏమిటి! ఈ నగలూ ఈ బట్టలూ అంతా అతని డాబు దర్పం సంపాదనలు ప్రదర్శించ డానికా! అంటే నేను పుట్టినప్పట్నుంచి నన్ను వీళ్ళంతా అలంకరిస్తున్నది దీని కోసమా?" ఆశ్చర్యపోయింది వరలక్ష్మి.

ఆ తర్వాత వరలక్ష్మిలో నైరాశ్యం ప్రవేశించింది. ఆమెకు విలువైన బట్టలు విలువ కట్టలేని నగలూ అర్థం లేనివిగా అనిపించాయి. ఓరోజు వున్నట్లుండి వరలక్ష్మికి ఏమనిపించిందో వెంటనే ప్లేను టికెట్టు కొనుక్కొని బెంగుళూరు భర్త దగ్గరికి బయలుదేరింది.

వరలక్ష్మి బెంగళూరు ఎయిర్‌పోర్టులో దిగింది. ఫోన్ చేస్తే భర్త పొద్దున ఇంకా నిద్రలేచాడో లేదో అతన్ని డిస్టర్బు చేయడం ఎందుకులే అనుకుంది వరలక్ష్మి. ఎయిర్‌పోర్టులో టాక్సీ తీసుకొని ఇంటికి బయలుదేరింది.

పెద్ద ఇల్లు. చుట్టూ తోట. తను ఇంతకు ముందు వచ్చింది ఈ ఇంటికి. ఈ ఇల్లంతా ప్రసాద్ అభిరుచి ప్రకారమే అలంకరించబడింది. తన ప్రమేయం ఏమీ లేదు.

వరలక్ష్మి ట్యాక్సీడ్రైవరుకు డబ్బిచ్చి చక్కంగా ఇంట్లోకి పోయింది. అప్పటికి పొద్దున తొమ్మిదయిందేమో. పనివాళ్ళు వాళ్ళ వాళ్ళ పనుల్లో బిజీగా వున్నారు. వరలక్ష్మి చక్కంగా పైనున్న బెడ్‌రూంకి పోయింది. అక్కడ భర్త నిద్రపోతుంటాడు. వరలక్ష్మి మెల్లగా బెడ్‌రూం తలుపులు తోసి లోపలికి పోబోయింది. ఇంతలో ఆమెకు ఎదురుగా విశాలమైన మంచం మీద భర్త - అతని పక్కన ఓ అందమైన యువతి చాలా చిన్న వయస్సులో వుంది ఆమె - అర్ధనగ్నంగా ఒకరితో ఒకరు పెనవేసుకొని పోయి గాఢనిద్రలో కన్పించారు.

ఆ దృశ్యం చూసి వరలక్ష్మి బిర్రబిగుసుకుపోయింది. ఆమె గుండె మెలిపెట్టి తిప్పినట్ల యింది. తన ముందు కన్పిస్తున్న దృశ్యాన్ని నమ్మలేకపోయింది. షాక్‌తో కాస్సేపు అట్లాగే నిలబడిపోయింది. కాస్సేపటికి తేరుకొని వెనుకకు పరిగెత్తింది. రోడ్డు మీదికిపోయి టాక్సీ తీసుకొని ఎయిర్‌పోర్టు చేరుకుంది. తిరుగు ప్రయాణానికి ప్లేను టికెట్టు దొరికింది. తీసుకుని ప్లేను ఎక్కింది.

వరలక్ష్మి మనస్సంతా కకావికలమైంది. "ఇదేమిటి తన భర్త మరో ఆడదానితోనా? - ఎన్నడూ దీన్ని తను ఊహించలేదు. ఆయన అటువంటి వాడు అని తను అనుకోనే లేదు. నేను మరో మగాడితో మాట్లాడితేనే సహించలేని మనిషి మరో స్త్రీతోనా పడుకోవడం !" వరలక్ష్మికి ఏడ్పు వచ్చింది. పెద్దగా శోకంపెట్టి ఏడ్వాలనిపించింది. కాని అది ప్లేను. ప్లేనులో ఏడ్వలేకపోయింది.

"ఇదంతా ఏమిటని అడిగితే అతడు నిజం చెప్తాడా? ఏదో కట్టుకథ చెప్తాడు. తల్లీతండ్రీ తనను సమాధానపడమంటారు. నాకు తెలుసు. వాళ్ళు ఆయన తప్పేం లేదన్నట్లు మాట్లాడ్తారు! కాని నేను ఈ విషాన్ని మాత్రం మింగలేను. నేను మరో మగాడితో యిట్లా పడుకుంటే అతని కెట్లా వుంటుంది! అట్లాగే తనకుంటుందని అతడు అనుకుంటాడా? - లేదు. అనుకోడు. తనకు తెలుసు! ఏం చేయనట్లుగా తన తప్పేం లేదన్నట్లుగా అందర్నీ దబాయిస్తాడు. అతనికి నేనంటే లెక్కలేదు. అప్పుడు నేను మాత్రం ఎందుకు?" ఆలోచనలతో వరలక్ష్మి మెదడు వేడెక్కిపోయింది.

"ఒకవేళ ఆ యువతి అతనికి అవసరంగా మారి సంబంధం ఏర్పడ్డదేమో?" అనుమానంగా అనుకుంది వరలక్ష్మి. వెంటనే ఆమెకు కన్నీళ్ళు పైకుబుకాయి.

"ఛీ! తనెందుకు ఏడుస్తున్నది. ఏడ్వకూడదు!" అనుకొని కర్చీఫ్‌తో కన్నీళ్ళు తుడుచుకుంది వరలక్ష్మి.

హైద్రాబాదు ఎయిర్‌పోర్టులో దిగాక వరలక్ష్మి చక్కంగా ఇంటికి పోలేదు. లాయరు దగ్గరికి పోయింది. లాయరు వరలక్ష్మిని చూసి ఆశ్చర్యపోయాడు.

"ఏమమ్మ! వరలక్ష్మి! ఒక్కదానివే వచ్చావా?" అడిగాడు.

"అవును ఒక్కదాన్నే వచ్చాను" పొడిగా కక్షగా అంది వరలక్ష్మి.

"రమ్మంటే నేను ఇంటికి వచ్చేవాడ్ని గదా" అన్నాడు లాయరు.

"ఇది అర్జంటు పని లాయరు"

"సరే కూర్చో అమ్మా! అవునూ నీ నగలు అన్నీ ఏవి? ఇట్లా బోసిగా నేనెప్పుడూ నిన్ను చూడలేదు!" అన్నాడు లాయరు ఆశ్చర్యాన్ని దాచుకుంటూ.

"ఇప్పుడు నాకు వాటి మీద ఇష్టంలేదు లాయరుగారూ!" అంది వరలక్ష్మి దృఢంగా.

"సరే నువ్వు వచ్చిన పనేమిటో చెప్పమ్మా!" అన్నాడు లాయరు.

"నాకు విడాకులు కావాలి!" అంది వరలక్ష్మి. ఆమె కంఠస్వరం దృఢంగా వుంది. ఏదో కృత నిశ్చయం ఆమె ముఖాన్ని ఆవరించి వుంది.

* * *